క్లుప్తంగా

చెత్తను తొలగించారు..



సాక్షి ఎఫెక్ట్..

డోర్నకల్: మున్సిపాలిటీ పరిధిలోని పలు వీధుల్లో సోమవారం ఇళ్లలో పేరుకు పోయిన చెత్తను సిబ్బంది తొలగించారు. గత 20 రోజులుగా ఇళ్లలో పేరుకు పోయిన చెత్తతో ఎదురవుతున్న ఇబ్బందులపై సాక్షి దినపత్రికలో కథనం వెలువడటంపై స్పందించిన మున్సిపల్ కమిషనర్ నిరంజన్ చెత్తను వెంటనే తొలగించాలని ఆదేశించారు.

కళారత్న అవార్డు ప్రదానం

నెహ్రూసెంటర్/తొర్రూరు రూరల్: జిల్లా కేంద్రంలోని కన్నన్న కాలనీకి చెందిన కేదాసు రమేష్, తొర్రూరు మండలంలోని అరిపిరాల గ్రామానికి చెందిన తెల్లారి రామతార జాతీయ కళారత్న అవార్డు అందుకున్నారు. వరంగల్‌లోని వాగ్దేవి కళాశాలలో జరిగిన సఫల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ అధ్యక్షుడు వల్లంపట్ల నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా సోమవారం అందుకున్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



మహబూబాబాద్ అర్బన్: తొర్రూరు మైనార్టీ గురుకుల బాలికల పాఠశాల కళాశాలలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు ఫాతిమా బేగం ఏప్రిల్‌లో మృతి చెందారు. టిమ్రీస్ సంస్థలో పని చేస్తున్న ఉర్దూ విభాగం, ఉపాధ్యాయులు రూ.2లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్‌ను కూతురు అక్సా థంకీన్ పేరుతో బాధిత కుటుంబానికి సోమవారం ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వనజ, ఉపాధ్యాయులు సల్మాన్ ఖుర్షీద్, అస్మా పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ క్యాంపు కార్యాలయంలో సోమవారం సత్యవతిరాథోడ్ పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మహబూబ్‌పాషా, రవి, శ్రీను, రమేశ్ పాల్గొన్నారు.

మురుగు తొలగింపునకు చర్యలు

డోర్నకల్: స్థానిక మైనారిటీ బాలికల గురుకుల పాఠశాల పక్కన నిల్వ ఉన్న మురుగు నీటిని సోమవారం తహసీల్దార్ ఇమ్మానియల్, మున్సిపల్ కమీషనర్ నిరంజన్ తదితరులు పరిశీలించి పాఠశాల పక్కన నిల్వ ఉన్న మురుగునీటిని తొలగించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రిజ్వానా, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కాసం శేఖర్, పట్టణ అధ్యక్షుడు సుమేర్‌చంద్‌జైన్ పాల్గొన్నారు.

నేడు మానసాదేవి ఆలయ వార్షికోత్సవం

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని శిఖార్ఖానగడ్డలో గల శ్రీముత్యాలమ్మతల్లి దేవాలయ ప్రాంగణంలోని శ్రీమానసాదేవి ఆలయ అష్టమ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం నిర్వహిస్తున్నామని అర్చకులు బ్రహ్మశ్రీ యుగంధర్ శర్మ, బ్రహ్మశ్రీ భరద్వాజశర్మ సోమవారం తెలిపారు.

అభినందనీయం

తొర్రూరు రూరల్: పేద విద్యార్థులకు చేయూత ఇవ్వడం అభినందనీయమని ఎంఈఓ మహంకాళి బుచ్చయ్య అన్నారు. సోమవారం మండలంలోని పెద్దమంగ్యా తండా ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు మాజీ సర్పంచ్ జాటోతు శారద, ఐటీఐ కళాశాల కరస్పాండెంట్ జాటోతు రమేష్‌నాయక్ ఆధ్వర్యంలో పుస్తకాలు, నోటు పుస్తకాలు, కుర్చీలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మాలతి, కార్యదర్శి నీరజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

దంతాలపల్లి: వరినాట్లు వేసే ముందు రైతులు నారు కొనలుతుంచడం ద్వారా మొగి పురుగు పొలంలో ఆశించదని మండల వ్యవసాయ అధికారి వాహిని అన్నారు. మండలంలోని కుమ్మరికుంట్ల, గున్నెపల్లి గ్రామాలలో సోమవారం రైతుల పొలాలను, పత్తి చేనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పలు పంటల గురించి తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు.

కరపత్రాల ఆవిష్కరణ

గూడూరు: గిరిజన గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా తెలంగాణ గిరిజన సమాఖ్య కృషి చేస్తుందని జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోతు రవీందర్‌నాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆగస్టు 2న గూడూరులో జరుగే టీజీఎస్ మహాసభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. నాయకులు యాక్యనాయక్, బాలాజీ నాయక్, మల్లయ్య పాల్గొన్నారు.

నెరవేరనున్న సొంతింటి కల

- ఫైలెట్ ప్రాజెక్టుగా పోచారం గ్రామం ఎంపిక
- కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



పోచారం గ్రామంలో నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు

పెద్దవంగర: సొంత ఇల్లు ప్రతి మనిషి జీవితంలో ఓ చిరకాల కల.. మట్టితో చేసిన గుడిసే అయిన సరే అందులో ప్రతి ఇటుక, ప్రతి గోడ ఒక్కో అనుబంధానికి గుర్తుగా నిలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదల జీవితాల్లో వెలుగులు నింపుతోంది. లక్షలాది రూపాయల నిధులతో ప్రభుత్వ సాయంగా నిలుస్తూ సొంతింటి ఇంటి నిర్మాణానికి పనులు ముమ్మరం చేసింది. ఈ నేపథ్యంలో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మొదట విడుతలో మండలంలోని పోచారం గ్రామాన్ని ఫైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. ఇప్పటి వరకు 20 ఇళ్ల నిర్మాణాలు నిర్మిండానికి లబ్ధిదారులు ముందుకు రాగా 10మంది లబ్ధిదారుల ఇళ్ల బేస్‌మెంట్ లెవెల్, 3స్లాబ్ లెవెల్‌కు వచ్చాయి. మిగిలిన లబ్ధిదారులు త్వరలోనే ఇళ్ల నిర్మాణాలు చేపట్టనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటి వరకు 6మంది లబ్ధిదారులకు రూ.లక్ష చొప్పున మొదటి విడత డబ్బులు జమ అయినట్లు తెలిపారు.

రెండో విడతలో..

మండలంలోని అవుతాపురం 22, బావోజీతండా 05, బంగారు చెలిమి తండా 02, బొమ్మకల్లు 18, చిన్నవంగర19, చిట్యాల 25, గంట్లకుంట 18, కాన్వాయి గూడెం 09, కొరిపల్లి 14, లొట్లబండ తండా 01, మోత్యాతండా 03, పడమటి తండా 06, పెద్దవంగర 29, పోచంపల్లి 13, పోచారం 30, రాజ్‌మాన్ సింగ్ తండా 05 రెడ్డికుంట తండా 05 ఉప్పరగూడెం 15, వడ్డెకొత్తపల్లి 26తో కలిపి మొత్తం 276 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. లబ్ధిదారులు ఎంపిక పూర్తి కాగా ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈక్రమంలో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సొంతింటి కల నిజం చేస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

కల నిజమవుతోంది..



ఇంతకాలం తర్వాత సొంతింటి కల నిజమవుతోంది. ఇళ్లు లేక ఎండ, వానకాలంలో తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఇళ్లు మంజూరు కావడంతో ప్రజలు సంతోష పడుతున్నారు. పండుగ రోజుల్లో ఇల్లు లేదన్న బాధ చాలా మందిలో ఉండేది.

- బానోతు సీతారాం నాయక్, భద్రుతండా

వేగంగా పనులు



ఇందిరమ్మ పథకంలో ప్రతి అర్హుడికి స్వగృహం కల నెరవేరేలా చర్యలు తీసుకుంటున్నాం. పోచారం గ్రామాన్ని ఫైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని తొలి విడతలో ఇళ్లు మంజూరు చేయడంతో పనులు వేగంగా కొనసాగుతున్నాయి. రెండో విడతలో లబ్ధిదారులను పెంచుతూ, నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం.

- వేణుమాధవ్, ఎంపీడీఓ, పెద్దవంగర

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



దామ్య తండాలో బస్సు పైభాగంలో వేలాడుతూ కనిపిస్తున్న విద్యుత్ తీగలు



తోకబోడు తండాలో ట్రాక్టరుకు తగిలేలా కనిపిస్తున్న విద్యుత్ తీగలు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని దామ్యతండా గ్రామ పరిధిలోని పలుతండాల్లో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉండి స్థానికులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. విద్యుత్ తీగలు చేతికి అందేంత ఎత్తులో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేలాడుతున్న విద్యుత్ తీగలు పాఠశాల బస్సుకు తగిలేంత ఎత్తులో ఉన్నాయన్నారు. అదే విధంగా తోకబోడు తండా పరిధిలోని వ్యవసాయ భూములు, ఇళ్ల ప్రాంతాల్లో కూడా విద్యుత్ తీగలు చేతికి అందేంత ఎత్తులో ఉన్నాయని స్థానికులు పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకోవాలి



బ్యాగులు పంపిణీ చేస్తున్న డీఈఓ రవీందర్‌రెడ్డి

కురవి: విద్యార్థులు క్రమశిక్షణతో ఉండి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకోవాలని డీఈఓ రవీందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కొత్తూరు(జీ) శివారు ఖాసీం(తాట్యతండా) ప్రాథమిక పాఠశాలలో యూనిఫాం, దాతల సహకారంతో టై, బెల్టులు, బ్యాగ్స్, సౌండ్ సిస్టమ్, ఫ్యాన్, మధ్యాహ్నం భోజనం చేసేందుకు ప్లేట్స్‌ను డీఈఓ రవీందర్‌రెడ్డి విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంఓ ఆజాద్, డీఎస్‌ఓ అప్పారావు, ఎంఈఓ బాలాజీ, హెచ్‌ఎం మంజుల, ఉపాధ్యాయురాలు మాధవి, సీఆర్‌పీ ఉమ, సామాజిక వేత్త బోడ వినోద్‌కుమార్, తండా పెద్దలు పాల్గొన్నారు. కాగా దాతలను డీఈఓ రవీందర్‌రెడ్డి సన్మానించారు.

రాజ్యాధికారం సాధించడమే లక్ష్యం



సమావేశంలో పాల్గొన్న నాయకులు

పెద్దవంగర: ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ఇన్‌చార్జ్ సుబ్బారావు మాదిగ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సాయి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో ఎమ్మార్పీఎస్‌లో పని చేసిన వ్యక్తులను తొలగిస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో రాజ్యాధికారం సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుదామని సూచించారు. ఈ సమావేశంలో కొత్తపల్లి మధు మాదిగను ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్‌గా, చిలుక సిద్ధు, జలగం శ్రీనివాస్‌ను కోఇన్‌చార్జ్‌లుగా నియమించారు. ఎంఎస్పీ మండల ఇన్‌చార్జ్‌గా జలగం శ్రీనివాస్ మాదిగ నియమితులయ్యారు. కార్యక్రమంలో ఈదురు సైదులు, జలగం జంపయ్య, చిలుక బిక్షపతి, దంతాలపల్లి ఉపేందర్, చింతల ఐలయ్య, చిలుక వెంకన్న, సైదులు, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

తల్లీకూతుళ్లు అదృశ్యం.. కేసు నమోదు



తల్లీకూతుళ్లు

గార్ల: తల్లీకూతుళ్లపై అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్‌కె.రియాజ్‌పాషా సోమవారం తెలిపారు. వివరాలిలావున్నాయి. మండలంలోని రాంపురం గ్రామానికి చెందిన ఎలమకంటి శ్రీను మద్యానికి బానిసై తరచూ భార్య సుమలతను వేధింపులకు గురిచేయడంతో, భర్తవేధింపుల తాళలేక ఈనెల 25న ఇంట్లో ఎవరికి చెప్పకుండా 11 సంవత్సరాల కూతురును తీసుకొని ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. నాటి నుంచి బంధువులు, చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా వారి ఆచూకీ లభ్యం కాలేదు. బాధితురాలి అక్క రేణుక ఫిర్యాదు మేరకు తల్లికూతుళ్లపై అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు పాటించాలి



పరీక్షలు చేస్తున్న వైద్యులు

మరిపెడ రూరల్: వానాకాలం సోకే సీజనల్ వ్యాధులపై పలు జాగ్రత్తలు పాటించాలని మరిపెడ మెడికల్ ఆఫీసర్ గుగులోతు రవి సూచించారు. సోమవారం మరిపెడ మండలం ఎల్లారిగూడెం గ్రామ ప్రాథమిక పాఠశాలలో మరిపెడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా 40మంది గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ రవి మాట్లాడుతూ.. వర్షాకాలంలో దోమలు వ్యాపించి మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, మెదడు వాపు, బోధకాలు వ్యాధులు సోకే అవకాశం ఉందన్నారు. క్యాక్రమంలో ఎంపీఓ సోమ్లనాయక్, పల్లె దవాఖానా సిబ్బంది తరుణి, హెల్త్ సూపర్‌వైజర్స్ కృష్ణ, సుదర్శన్, ఆచార్యులు, కార్యదర్శి లెనిన్, హెల్త్ అసిస్టెంట్ నర్సయ్య, ఏఎన్‌ఎం విజయ, ఆశ గణిత పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేయాలని రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కేసముద్రం: కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన రహదారులపై ఏర్పడిన గుంతలను వెంటనే మరమ్మతు చేయాలంటూ మున్సిపాలిటీ కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సోమవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. కేసముద్రంస్టేషన్ నుంచి కేసముద్రంవిలేజ్ వరకు ప్రధాన రహదారిపై పలుచోట్ల గుంతలు ఏర్పడ్డాయని, దీంతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాస్తారోకోతో పలు వాహనాలు నిలిచిపోయాయి. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు నీలం దుర్గేష్, మండల ప్రధాన కార్యదర్శి కముటం శ్రీనివాస్, రావుల శ్రీనాథ్‌రెడ్డి, గుగులోతు వీరునాయక్, కొండ్రెడ్డి రవీందర్‌రెడ్డి, మోడెం రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో మెరుగైన వైద్యసేవలు



శిశువును పరీక్షిస్తున్న డాక్టర్ ప్రవీణ్ కుమార్

చిన్నగూడూరు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే మెరుగైన వైద్య సేవలు అందుతాయని ఉగ్గంపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ అన్నారు. మండలంలోని ఉగ్గంపల్లి గ్రామానికి చెందిన నాగేంద్ర సోమవారం పురిటి నొప్పులతో ఉగ్గంపల్లి పీహెచ్‌సీకి రావడంతో వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ వైద్య పరీక్షలు నిర్వహించి సాధారణ ప్రసవం చేశాడు. ఈ కాన్పులో 2.50 కేజీల బరువుతో మగబిడ్డకు జన్మనిచ్చింది. ప్రస్తుతం తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ. పీహెచ్‌సీలో అత్యాధునిక టెక్నాలజీతో సుఖప్రసవాలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్సు మాధవి, ఏఎన్‌ఎం భారతి, ఆశలు, తదితరులు ఉన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై ప్రవీణ్‌కుమార్

చిన్నగూడూరు: రాబోయే స్థానికసంస్థల ఎన్నికలపై మండలంలోని జయ్యారం గ్రామంలో చిన్నగూడూరు పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. గుడుంబా, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. స్థానికసంస్థ ఎన్నికలపై గ్రామాల్లో ఎవరిని కించపరిచేవిధంగా సోషల్ మీడియాలో పోస్ట్‌లు పెట్టవద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటయ్య, పోలీస్ సిబ్బంది, గ్రామప్రజలు పాల్గొన్నారు.

అధ్యక్షుడి పర్యటనను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

మహబూబాబాద్ అర్బన్: ఈనెల 30న మానుకోట జిల్లా కేంద్రానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామ్‌చందర్‌రావు పర్యటనను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత మొట్టమొదటి సారిగా జిల్లాకు పర్యటనకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుధీర్ రెడ్డి, రామచంద్రరావు, మాజీ ప్రధాన కార్యదర్శి మహేష్ గౌడ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శ్యామ్ సుందర్ శర్మ , ధర్మారెడ్డి పాల్గొన్నారు.

అతివేగంతోనే ప్రమాదం

నెల్లికుదురు: అతివేగం, అజాగ్రత్తతోనే ఆటో బావిలోకి దూసుకెళ్లిందని ఎస్సై చిర్ర రమేష్ బాబు తెలపారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఎస్సై మాట్లాడుతూ.. మండలంలోని మునిగలవీడు గ్రామానికి చెందిన శ్రీరాం నర్సయ్య (65) భార్య భారతమ్మ, తన కొడుకు మార్కండేయ ఆటోలో మండలంలోని శ్రీరామగిరి శివారు వెంకటాపురంలో ఆదివారం తమ బంధువుల అంత్యక్రియకుల వెళ్లారు. అదే రోజు రాత్రి ఇంటికి వస్తున్న ఆటో అతివేగంతో ప్రమాదవశాత్తు గ్రామ పరిధిలోని రహదారి పక్కనే ఉన్న బండల పాత బావిలోకి ఆటో దూసుకెళ్లి బోల్తా కొట్టింది. ఈప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న శ్రీరాం నర్సయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటో నడుపుతున్న మార్కండేయకు స్వల్ప, మృతుడి భార్య భారతమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. ఈమేరకు మృతదేహానికి పంచనామ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సంక్షిప్త సమాచారం

సద్వినియోగం చేసుకోవాలి

పెద్దవంగర: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఏసీడీపీఓ విజయలక్ష్మి సూచించారు. సోమవారం మండలంలోని బొమ్మకల్లు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను సూపర్ వైజర్ శోభతో కలిసి సందర్శించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రంగు అంబిక, యాదమ్మ, కవిత పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన పూజలు ప్రారంభం

నెల్లికుదురు: మండల కేంద్రంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ పునర్ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో సోమవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాలు మొదలయ్యాయి. వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల నడుమ హోమాలు ప్రత్యేక పూజలు చేశారు.

నేత్రదానం చేయాలి

గార్ల: ప్రతీ ఒక్కరు నేత్రదానం చేసి పలువురికి చూపును ప్రసాదించాలని ఖమ్మం నేత్రనిధి సభ్యుడు పగడాల నాగేశ్వరరావు కోరారు. మండలంలోని పినిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన వంగూరి పాపయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయన నేత్రాలను నేత్రనిధికి దానం చేయగా సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు ప్రశంసపత్రం అందజేశారు.

అవార్డు అందజేత

కురవి: మండలంలోని సూదనపల్లి యూపీఎస్‌లో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న వెంగంటి శుభకు లీడ్ ఫౌండేషన్ గ్లోబల్ ఆధ్వర్యంలో ఆదివారం కాజీపేటలో అబ్దుల్‌కలాం వర్ధంతిని పురస్కరించుకుని వింగ్స్ ఆఫ్ ఫైర్ ఎక్సలెన్సీ అవార్డు-2025ను అందజేశారు.

మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలి

నెల్లికుదురు: మండలంలోని వివిధ గ్రామాల్లో సీజనల్ వ్యాధులు దరి చేరకుండా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని పీవైఎల్ జిల్లా కార్యదర్శి మట్టు చైతన్య డిమాండ్ చేశాడు. సోమవారం స్థానిక వైద్యాధికారి శారదకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా సహాయ కార్యదర్శి ఇరుగు అనిల్, సయ్యద్ పాషా, రాజేష్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కురవి: విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సీరోలు ఎస్సై జి.సంతోష్ అన్నారు. సోమవారం సీరోలు మండలం కాంపల్లి జెడ్పీ హైస్కూల్‌లో పోలీస్ కళాజాగృతి బృందం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గంజాయి, మత్తుపానియాలు, సైబర్‌నేరాలు, మూఢనమ్మకాలు, బ్యాడ్-గుడ్ టచ్‌పై పాటల రూపంలో కళాకారులు అవగాహన కల్పించారు.

శంకుస్థాపన

కురవి: మండలంలోని బంచరాయి తండా గ్రామంలో డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్ ఆదేశాల మేరకు ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు కాంగ్రెస్ నాయకుడు లూనావత్ విజయ్‌నాయక్ సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నాయకులు గోపానాయక్, కృష్ణానాయక్, పున్న నాయక్, బానోత్ విజయ్‌నాయక్, బిచ్చునాయక్, భద్రునాయక్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

డోర్నకల్: గొల్లచర్ల, చిలుకోడు మార్గంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. గార్ల మండలం సీతంపేట బడితండాకు చెందిన బానోత్ ఈర్యా తన కుమారుడు మోక్షిత్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై బంధువుల ఇంటికి వెళ్తున్నారు. చిలుకోడు సమీపంలో వాహనం అదుపు తప్పి కింద పడటంతో ఈర్యాకు తీవ్ర గాయాలు కాగా మోక్షిత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రేషన్ కార్డుల పంపిణీ

డోర్నకల్: మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో సోమవారం లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు తాళ్లూరి రామయ్య, తాళ్లూరి హనుమంతరావు, పెద్దిని నర్సింహయ్య పాల్గొన్నారు.

ఆలయానికి సౌండ్ టైమర్ బహూకరణ

డోర్నకల్: స్థానిక ముత్యాలమ్మతల్లి ఆలయానికి పలువురు దాతల సహకారంతో సౌండ్ టైమర్‌ను బహూకరించారు. దాతలు అందించిన భక్తి సూక్తులతో సమయాన్ని తెలియజేప్పే యంత్రాన్ని సోమవారం ఆలయంలో అమర్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కాలా మహేందర్ జైన్, శీలం శ్రీనివాస్, సుమేర్‌చంద్‌జైన్, గాజుల వేణుగోపాల్, కేశబోయిన కోటిలింగం, మాదా శ్రీనివాస్, శేఖర్, రామకృష్ణ, అనిల్ పాల్గొన్నారు.

బీజేపీ బలం పెరుగుతోంది..

డోర్నకల్: గ్రామాల్లో బీజేపీ బలం గణనీయంగా పెరుగుతోందని బీజేపీ మండల అధ్యక్షుడు బానోత్ గణేష్‌నాయక్ తెలిపారు. డోర్నకల్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఈనెల 30 మహబూబాబాద్‌లో జరిగే కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామ్‌చందర్‌రావు సమక్షంలో మండల నుంచి భారీ చేరికలు ఉంటాయని తెలిపారు.

డ్రంసీడర్ పద్ధతిలో విత్తుకోవాలి

గూడూరు: వర్షాలు ఆలస్యమై ఇప్పటి వరకు వరినారు పోసుకోని రైతులు నేరుగా పొలాలను దమ్ము చేసుకొని వెదజల్లే లేదా డ్రంసీడర్ పద్ధతిలో విత్తుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎండీ అబ్దుల్‌మాలిక్ అన్నారు. మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో వరినాటు వేస్తున్న పొలాల వద్దకు ఏఓ సోమవారం వెళ్లారు. తాను రైతునేనంటూ కూలీలతో కల్సి నాటు వేస్తూ రైతులకు సాగు సూచనలు ఇచ్చారు.

చికిత్స పొందుతున్న మహిళా రైతు మృతి



మల్లీశ్వరి (ఫైల్)

మహబూబాబాద్ రూరల్: చికిత్స పొందుతూ మహిళా రైతు మృతిచెందిన సంఘటన మహబూబాబాద్ మండలంలోని మాధవాపురం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. మండలంలోని మాధవాపురం గ్రామానికి చెందిన మహిళ రైతు నూకల మల్లీశ్వరి వ్యవసాయ పనుల్లో భాగంగా ఈనెల 25వ తేదీన తమ పత్తి చేను వద్దకు వెళ్లింది. పాము కాటు వేయగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఖమ్మంలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది.

మద్యం దుకాణం ఏర్పాటుకు తీర్మానం

గార్ల: గార్లలో మద్యం దుకాణం ఏర్పాటుకు ఆమోదం తెలుపుతూ పీసా గ్రామసభలో మెజారిటీ సభ్యులు చేతులెత్తి తీర్మానం చేశారు. గార్ల గ్రామ పంచాయతీ పరిధిలో ఏ4 మద్యం షాపులను వచ్చే ఎక్సైజ్ ఈయర్ 2025-27 లేదా ప్రభుత్వం నిర్ణయించిన కాలపరిమితి మేరకు ఏర్పాటు చేయుటకు గాను సోమవారం గార్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీఓ మంగమ్మ అధ్యక్షతన పీసా గ్రామసభ నిర్వహించారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

కురవి: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు కురవికి చెందిన దాతలు బానోత్ లక్ష్మణ్, బానోత్ భానుప్రకాశ్‌లు శ్రీమద్ రాజచంద్ర మిషన్ ధరంపూర్ సౌజన్యంతో విద్యార్థులకు నోట్‌బుక్స్ బహూకరించగా సీఐ చేతులమీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎండీ వాహిద్, ఉపాధ్యాయులు దైద వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, విజయ్‌రాజ్, నర్సింహాచారి, బాలాజీ, మల్లికార్జున్, శ్యామలదేవి పాల్గొన్నారు.

చీడపీడల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి

చిన్నగూడూరు: వాతావరణం పొడిగా మారడంతో పత్తి పంటలో చీడపీడలు ఉధృతం అయ్యే అవకాశం ఉన్నందున చీడపీడల నివారణకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి భాస్కర్ సూచించారు. సోమవారం మండలంలోని ఉగ్గంపల్లి గ్రామ శివారులో పత్తి పంటలను పరిశీలించారు.

రామచంద్రారెడ్డి సేవలు మరువలేనివి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్

మహబూబాబాద్ అర్బన్: నూకల రామచంద్రారెడ్డి జిల్లా ప్రజలకు రైతులకు చేసిన సేవలు మరువలేనివని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బి.లక్ష్మణ్ నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని నూకల రామచంద్రా రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రామచంద్రారెడ్డి వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు అనిల్, సాంబశివరావు, అన్నపూర్ణ, శ్రీనివాస్, రాజశేఖర్, ఖాసీంషా, సుమన్, యుగేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.